బ్రెయిన్ ట్యూమర్‌కు అత్యాధునిక చికిత్స

- బాధితులు భయపడాల్సిన అవసరం లేదు
- ప్రారంభ దశలోనే వైద్య చికిత్స అవసరం
- యశోద ఆస్పత్రి న్యూరో సర్జన్ కెఎస్ కిరణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రెయిన్ ట్యూమర్‌కు చేసేది అత్యంత అరుదైన శస్త్ర చికిత్స అని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్జరీలను విజయవంతంగా పూర్తి చేస్తున్నామని యశోద ఆస్పత్రి న్యూరో సర్జన్ కెఎస్ కిరణ్ చెప్పారు. మెదక్ పట్టణంలోని పల్స్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. మానవ జీవన శైలిలో పలు కారణాల వల్ల బ్రెయిన్ ట్యూమర్ వస్తుందన్నారు. అది వస్తే కాళ్లు, చేతులు పడిపోతాయనే అపోహ, భయంతో సర్జరీ చేయించుకోకుండా చాలా మంది చివరి దశలో ఆస్పత్రికి వస్తున్నారన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సర్జరీకి అత్యాధునిక టెక్నాలజీ వచ్చిందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. మెదక్ పట్టణానికి చెందిన జర్నలిస్టు కామాటి కృష్ణ ఇటీవల స్పృహ కోల్పోయిన స్థితిలో స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని, అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి వచ్చారని వివరించారు. పరీక్షలు చేసి బ్రెయిన్‌లో కణితి ఉన్నట్టు గుర్తించామన్నారు. మెదడు రక్తనాళాల్లో మంచి, చెడు అనే రెండు రకాల ట్యూమర్లు ఉంటాయన్నారు. అన్ని రకాల పరీక్షలు చేసి ట్యూమర్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అక్కడ మాత్రమే కట్ చేసి సర్జరీ చేసినట్టు తెలిపారు. మైక్రోస్కోప్‌లో చూసుకొని రక్తనాళాల నుంచి ట్యూమర్‌ను తీసేశామన్నారు. ప్రస్తుతం కృష్ణ కోలుకొని సాధారణ జీవనం గడుపుతున్నారని తెలిపారు. శస్త్రచికిత్స బృందం కణితిని సున్నితంగా తొలగించడానికి అత్యాధునిక ఇంట్రా ఆపరేటివ్ నర్వ్ మానిటరింగ్, న్యూరోనావిగేషన్ టెక్నాలజీలను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. న్యూరో మానిటరింగ్ సిస్టమ్ ద్వారా అన్ని భాగాలను పరిశీలించి సర్జరీ చేస్తారన్నారు. కీమో, రేడియేషన్ వంటివి అన్ని అప్‌గ్రేడ్ అయ్యాయని, సమస్య చిన్నగా ఉన్నప్పుడే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

బిఆర్ఎస్ జూనియర్ల రన్నింగ్ కామెంట్రీ

- వారిని బైటకు పంపవద్దని స్పీకర్‌కు సిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభలో సభ్యులు మాట్లాడుతున్న సమయంలో బిఆర్ఎస్ జూనియర్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి మాట్లాడే సమయంలో కూడా వారు ప్రవర్తించిన తీరు సభాసంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించిన సీనియర్ జర్నలిస్టులు, అధికారులు అభిప్రాయపడుతున్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం అసెంబ్లీలో చర్చ జరిగింది. అధికార పక్ష సభ్యులు, సిపిఐ సభ్యులు కూనంనేని మాట్లాడుతున్న సమయంలో బిఆర్ఎస్ సభ్యులు పదే పదే అడ్డుతగిలారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి సభలో అడుగుపెట్టిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్‌ల రన్నింగ్ కామెంట్రీతో ఇతర సభ్యులు ఇబ్బందికి గురయ్యారు. వారిద్దతో కలిసి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ తమ స్థానాల్లో నిలబడి అధికార పక్షం వైపు చేతులుచూపిస్తూ రన్నింగ్ కామెంట్రీ చేయడం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ సభ్యులను సైతం అసహనానికి గురి చేసింది. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పలు సందర్భాల్లో కౌశిక్ రెడ్డిని వారించే ప్రయత్నం చేసినా ఆయన పట్టించుకోలేదు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తిన బిఆర్ఎస్ సభ్యుడు హరీశ్ రావుకు స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో, పోడియం వద్దకు వెళ్లాలని బిఆర్ఎస్ సభ్యులకు హరీశ్ సైగ చేయడం విస్మయానికి గురిచేసింది. సిఎం మాట్లాడే సందర్భంలో కౌశిక్ రెడ్డి,సంజయ్‌లు పదే పదే అడ్డుతగిలినా బిఆర్ఎస్ సీనియర్ సభ్యులు వారిని వారించకపోవడం విచారకరం. కాగా, సభ జరుగుతున్నప్పుడు విప్ బీర్ల ఐలయ్య పలుసార్లు స్పీకర్ వద్దకు వెళ్లి స్లిప్పులు ఇవ్వడాన్ని డిప్యూటీ స్పీకర్ భట్టి విక్రమార్క వారించారు. కాగా, బిఆర్ఎస్ సభ్యులు ఎంత లొల్లి చేసినా వారిని బయటకు పంపవద్దని సిఎం రేవంత్ స్పీకర్‌కు విజ్ఞప్తి చేయడం కొసమెరుపు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది

- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మాజీ మంత్రి టి.హరీష్ రావు విమర్శించారు. శనివారం శాసన సభ వాయిదా అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. తమకు సభలో నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. ఎంఐఎం, బిజెపిలకు తగిన సమయం ఇచ్చేందుకు ప్రభు త్వం భయపడిందనీ, సిఎం రేవంత్ రెడ్డి గోబెల్స్ ప్రచారాలను, అబద్ధాలను సభలో చెప్పి, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని అన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడిగినా అవకాశం ఇవ్వకపోగా, తప్పులు బయటపెడతామనే భయంతో మూడు నిమిషాల్లో మూడు సార్లు మైక్ కట్ చేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలకు నిలయమైన కాంగ్రెస్ పార్టీనుంచి నీతులు చెప్పించుకునే అగత్యం తమకు పట్టలేదని అన్నారు. విదేశీయురాలైన సోనియాగాంధీని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు గా చేశారని గుర్తు చేశారు. ఢిల్లీలో పివి నరసింహా రావు సమాధికి గుంట జాగా ఇవ్వకుండా అవమానించారనీ, టంగుటూరు అంజయ్యను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అవమానించడాన్ని తెలంగాణ అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకున్నామనీ, కానిస్టేబుల్ కృష్ణయ్య కూతురుని డాక్టర్ చదివించింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే హక్కు సిఎంకు లేదనీ, ఉద్యమంలో రైఫిల్ పట్టుకుని రేవంత్ రెడ్డి తిరగలేదా? అంటూ ప్రశ్నించారు. వందలాది మంది ఉద్యమకారుల కేసులను బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తేసిందనీ, తమ మీద కూడా తెలంగాణ ఉద్యమ కేసులు ఇప్పటికీ ఉన్నాయని అన్నారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. రాష్ట్రం 6.59 శాతం సగటుతో వ్యవసాయ రంగంలో దేశంలో రెండవ స్థానంలో నిలిచిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వరి ధాన్యం 24 లక్షల మెట్రిక్ టన్నులు కాగా తమ ప్రభుత్వ హయంలో కోటీ 20 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నామని హరీష్ రావు తెలిపారు. మిరప పంటలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, పత్తి పంటలో దేశంలో రెండవ స్థానంలో ఉందని చెప్పారు.

ఓడినా... ప్రజా తీర్పును గౌరవించరా?

- దక్షిణ తెలంగాణకు తీరని అన్యాయం
- ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎందుకు ఎత్తేయలే?
- పేపర్ లీకేజీలపై బిఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి
- సిఎం రేవంత్‌రెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శాసనసభ నుంచి బిఆర్ఎస్ సభ్యులను బయటకు పంపించబోమనీ, ఇక్కడే కూర్చొబెట్టి కఠోర వాస్తవాలు వినిపిస్తామనీ, వారిలో పరివర్తన తెప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదే వారికి శిక్ష అంటూ విన్నవించారు. ప్రజలు ఓడించినా వారిలో మార్పు రావడం లేదన్నారు. ప్రజల తీర్పును గౌరవించడం లేదని విమర్శించారు. ప్రజాజీవితంలో అడుగుతాం...కడుగుతాం అని శ్రీశ్రీ అన్నాడు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వం ఎంతో కాలం ఉండబోదని హెచ్చరించారు.శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సిఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. ప్రజలు నిఖార్సయిన తీర్పు ఇచ్చినా బిఆర్ఎస్ నేతల్లో మార్పు లేదని ఎద్దేవా చేశారు. ఇనుప కంచెలు బద్దలు కొట్టినం... ప్రజలు బాధలు చెప్పుకునేందుకు వేల సంఖ్యలో వస్తున్నారని గుర్తు చేశారు. దీన్ని బిఆర్ఎస్ భరించలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ప్రజల చెమట చుక్క వాసన చూడలేక ఆనాడు ప్రగతిభవన్‌కు ప్రవేశం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి హోంమంత్రి మహమూద్ అలీని ప్రగతిభవన్‌కు అనుమతి లేదంటూ హోంగార్డు ఆపారనీ, మంత్రి ఈటల రాజేందర్‌ను పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపించారనీ, దీంతో ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారని గుర్తు చేశారు. గజ్జెకట్టి, గొంగడేసి, తన గళంతో దేశంలోని వంద కోట్ల మందిని ప్రభావితం చేసిన ప్రజా యుద్ధనౌక గద్దరన్నను కూడా లోపలికి రానీయలేదన్నారు. గంటల తరబడి ఆయన్ను ఎర్రటి ఎండలో నిలబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఆ పరిస్థిలు ఉండవని వివరించారు.

అసెంబ్లీలోనూ నిరంకుశత్వమే

పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం శాసనసభలోనూ నిరంకుశంగా వ్యవహరించిందని రేవంత్ చెప్పారు. ప్రశ్నించిన వారిని ఈడ్చికెళ్లి బయట పడేశారని చెప్పారు. గవర్నర్ ప్రసంగం సమయంలో లేచి నిలబడిన నాటి సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలను నిరంకుశంగా రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నిరసన తెలిపే హక్కును కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో అమరులైన వారి గురించి ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. వారి కుటుంబాలను పిలిచి బుక్కెడు బువ్వ పెట్టలేదని కెసిఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులపై కేసులు ఎందుకు ఎత్తేయలేదని ప్రశ్నించారు. త్యాగాలు చేసిన వారికి ఇచ్చే మర్యాదా ఇదేనా? అని ప్రశ్నించారు. కూతురు ఎంపిగా ఓడిపోతే మాత్రం కెసిఆర్ ఎమ్మెల్సీ ఇచ్చి పేగు బంధాన్ని నిరూపించుకున్నారని చెప్పారు. కరోనా సమయంలో రెమిడి ఇంజక్షన్‌కు రూ. 2వేలు ఉంటే, రూ. 5వేలకు అమ్ముకుని రూ 450 కోట్లు సంపాదించిన వ్యాపార వేత్తకు రాజ్యసభ ఇచ్చారని విమర్శించారు. డిఎస్‌పి ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలోకి దూకిన నళినిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఉద్యమ కారులపై ఇప్పటికీ కేసులు ఎత్తివేయలేదని వివరించారు. కెసిఆర్, ఆ కుటుంబంపై కేసులెన్ని? నిరుద్యోగులు, ఉద్యమకారులపై కేసులెన్ని? అందులో తొలగించినవి ఎన్ని? బిఆర్ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. చివరకు ధర్నా చౌక్‌ను కెసిఆర్ సర్కారు కూడా రద్దు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధర్నా చౌక్‌ను పునరుద్ధరించామని ప్రజలకు తెలిపారు. బిఆర్ఎస్ సభ్యులు కూడా కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత స్వేచ్ఛగా ఫోన్లు మాట్లాడగలుగుతున్నామని చెప్పారని వివరించారు.

ఆరు గ్యారంటీలే కాదు....ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యని ఇస్తామని సిఎం చెప్పారు. ఆరు గ్యారంటీలకు శాసనసభలో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన వారు గమనించాలని కెటిఆర్‌నుద్దేశించి ఎద్దేవా చేశారు. వాటికి చట్టం చేసే సమయంలో బిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపి, సిపిఐతోపాటు బయట పక్షాల సలహాలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ గ్యారంటీలను వల్లె వేయాలని కోరారు. గవర్నర్ ప్రసంగంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. అది కాంగ్రెస్ మ్యానిఫెస్టోనే అని వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వాలు కూడా ఇదే విధంగా చేశాయని తెలిపారు. అది తమ ప్రభుత్వ విజన్ డాక్యుమెంట్ అని గుర్తు చేశారు.

రైతుల ఆదాయంపై అబద్ధాలే

తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల ఆదాయం పెరిగిందంటూ బిఆర్ఎస్ అబద్ధాలు చెబుతున్నదని రేవంత్ విమర్శించారు. ఒకే అంశాన్ని పదే పదే చెప్పడం ద్వారా అదే నిజమని నమ్మించే ప్రయత్నం చేశారని విమర్శించారు. రైతుల ఆదాయంలో మన రాష్ట్రం 25 స్థానంలో ఉందన్నారు. మేఘాలయ రైతుల ఆదాయం కంటే మన రైతుల ఆదాయం తక్కువ ఉందన్నారు. ఎన్‌సిబిఆర్ లెక్కల ప్రకారం ఎనిమిది వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట బీమా ఇచ్చి ఉంటే రైతుల ఆత్మహత్యలు జరిగేవి కావన్నారు. రైతు మరణాలకు గత ప్రభుత్వం వెల కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు, చెరకు, మిరప, సోయాబిన్ వంటి పంటలను నిర్లక్ష్యం చేసిందన్నారు. వరి పండిస్తే ఉరే అంటూ నాటి సిఎం కెసిఆర్ రైతులను బెదిరించారని చెప్పారు. ఆయన ఫామ్‌హౌస్‌లోని 150 ఎకరాల్లో మాత్రం వరి పండించి మిల్లర్ల మెడపై కత్తి పెట్టి క్వింటా రూ. 4500లకు అమ్ముకున్నారని ఆరోపించారు.

కాలువల ద్వారా నీరు అందింతే...

విద్యుత్ తలసరి వినియోగంలో మనం రాష్ట్రం మొదటి స్థానంలో లేదని, దీనిపై అన్ని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కాలువల ద్వారా పంటలకు నీరు పుష్కలంగా అందుతుందని ఇప్పట దాకా బిఆర్ఎస్ నేతలు చెప్పారని తెలిపారు. కాలువల ద్వారా నీరు అందింతే, లక్షల కోట్లు ఖర్చు పెడితే 19 లక్షలు ఉన్న పంపు సెట్లు...29లక్షలకు పంపుసెంట్లు ఎందుకు పెరిగాయన్నారు. సమైక్యపాలనలో అన్యాయం జరిగితే జరిగి ఉండోచ్చు...కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఎందుకు అన్యాయం జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. నారాయణ పేట్, కొడంగల్ ఏడారిగా ఎందుకు మారిందో చెప్పాలని డిమాండ్ చేశారు. దక్షిణ తెలంగాణ నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు.బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వరదల్లో మునిగిపోయి నిరాశ్రయులైన ఆలంపూర్ ప్రజలకు ఇండ్లు కట్టిస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించారు.

ఇసుక లారీలతో తొక్కించి..కేసులు పెట్టి...హింసించి

వందల లారీల ఇసుక రవాణాతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నామంటూ నేరెళ్ల బాధితులు అడిగితే వారిని రకరకాలుగా హింసించారని తెలిపారు. లారీలో తొక్కించి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణాలు కెటిఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో జరిగాయన్నారు. బాధితులను పరామర్శించేందుకు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ వస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని గుర్తు చేశారు. పదోవతరగతి, ఇంటర్ పేపర్ల లీకేజీతో విద్యార్థులు మరణిస్తే కూడా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. టిఎస్‌పిఎస్‌సి అవకతవకలకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. 1990లో 610 జిఒ, జోన్ల వ్యవస్థను రద్దు చేయాలని అసెంబ్లీలో కెసిఆర్ మాట్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణలో బిఆర్ఎస్ సర్కారు విఫలమైందని చెప్పారు. రాష్ట్రంలోకి డ్రగ్స్ రాకుండా అడ్డుకుంటామనీ, దానికి వెనుక ఎవరున్న ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

ఇందిరమ్మ రాజ్యమంటే...

ఇందిరమ్మ రాజ్యమంటే ఏంటని బిఆర్ఎస్ సభ్యులు పదేపదే అడుగుతున్నారనీ, 'ఇందిరమ్మ రాజ్యమంటే... పేదలకు ఇండ్లు కట్టించడం, అసైన్డ్ భూములు, పోడు భూములు పట్టాలు ఇవ్వడం, ఫీజురీయింబర్స్‌మెంట్స్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడం, ప్రతి ఒక్కరికి హక్కులు కల్పించడం, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ 2500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, రూ. 500లకే గ్యాస్‌సిలిండర్ ఇవ్వడం' అనిచెప్పారు. ఇంకా ఎన్నో ఉన్నాయని, వాటి సందర్భం వచ్చినప్పుడు చెబుతామన్నారు.

మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో సిఐటియు విజయకేతనం

ఈ విజయం కార్మికులకే అంకితం : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో శనివారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో అధ్యక్షులుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఘన విజయం సాధించారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. నాలుగు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించిన లేబర్ కమిషన్ అధికారులు ఐదు గంటలకు ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో 410 ఓట్లకుగాను 403 ఓట్లు పోలయ్యాయి. సిఐటియుకు 227 ఓట్లు, టిఆర్ఎస్‌కెవికి 151 ఓట్లు పోలయ్యాయి. 76 ఓట్ల మెజారిటీతో సిఐటియు విజయకేతనం ఎగురవేసింది. మొదటిసారి పోటీ చేసిన బీఎంఎస్‌కు 25 ఓట్లు మాత్రమే వచ్చాయి. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు 76 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

భారీ విజయోత్సవ ర్యాలీ

మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో సిఐటియు ఘన విజయం సాధించిన అనంతరం పరిశ్రమ గేటు నుంచి టెక్నీషియన్స్ కాలనీ వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికుల సంక్షేమం కోసం నిరంతర పోరాడుతున్న సిఐటియు విజయం తమ జీవితాల్లో కొత్త మలుపు తీసుకొస్తుందంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. సిఐటియు విజయం కార్మికుల విజయమన్నారు. ఈ విజయాన్ని వారికే అంకితం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోనే మెరుగైన వేతన ఒప్పందం చేసిన ఘనత సిఐటియుకే దక్కుతుందన్నారు.

పోలీసులకు జవాబుదారీతనం అవసరం

- సివిల్ వివాదాలకు దూరంగా ఉండాలి
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలని, భూసెటిల్‌మెంట్లకు పాల్పడితే చర్యలు తప్పవని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. పోలీసులు తమవిధి నిర్వహణలో పారద ర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలని సూచించారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నేరేడ్‌మెట్‌లోని పోలీస్ కమిషన రేట్‌లో డీసీపీలు, అదనపుడిసిపిలు, ఎసిపిలతోపాటు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో సిపిప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. డ్రగ్స్ సరఫరా, వినియోగం మీద ఉక్కుపాదం మోపు తామన్నారు. డ్రగ్స్ నివారణకు కావాల్సిన అన్ని చర్యలూ తీసుకుంటామని, యువత మత్తు పదార్థాల భారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డ్రగ్స్ సరఫరా, వినియోగం మీద నిఘా పెంచాలని ఆదేశించా రు. రాచకొండ పరిధిలో ప్రజలు ధైర్యంగా ఉండేవిధంగా పోలీసుల పనితీరుండాలన్నారు. క్షేత్ర స్థాయిలో నేరాలను అరికట్టాలన్నారు. నిందితులను పట్టుకోవడంలో, నేరపరి శోధనలో సాంకేతిక ఆధారాలతో పాటు సిసిటివి కెమెరాల ను ఉపయోగించుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు, కరుడు గట్టిన నేరస్తులతో పాటు పాత నేరస్తుల కదలికల మీద ప్రత్యేక నిఘా ఉంచాల న్నారు. తిరిగి నేరాలకు పాల్ప డకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించా లని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ప్రజలతో మమేకమై పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రతిరోజూ కనీసం 15 నిమిషాల పాటు స్టేషన్ పరిధిలో ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలు తెలుసు కుంటూ, వారితో మమేకం కావాలని సూచించారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేం దుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన మరింత పెంచాలన్నారు. సమర్థవంతంగా పని చేసే అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తామ న్నారు. ఈ సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ తరుణ్ జోషీ, సైబర్ క్రైమ్ డిసిపి అనురాధ, యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర, మహేశ్వరం డిసిపి శ్రీనివాస్, మల్కాజ్‌గిరి డిసిపి గిరిజానకి, రోడ్ సేఫ్టీ డిసిపి శ్రీబాల, డిసిపి (అడ్మిన్) ఇందిర, అదనపు డిసిపి (అడ్మిన్) శ్రీనివాస రెడ్డితోపాటు ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహనకే వీక్షిత్ సంకల్ప యాత్ర

- గవర్నర్ తమిళిసై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గ్రామాల్లో అవగాహన కల్పించడమే వీక్షిత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట మండలం బొమ్మరాసిపేటలో భారత్ సంకల్ప యాత్రను ఆమె ప్రారంభించా రు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రధాని మోడీ తీసుకొచ్చిన ఎన్నో కార్యక్రమాలను దేశ ప్రజలందరికీ తెలిసే విధంగా రథయాత్రను ప్రారంభించినట్టు చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ వద్దకు వచ్చి మోడీ చేపట్టిన అన్ని కార్యక్రమాలను ప్రజలకు సవివరంగా తెలిసే విధంగా రథయాత్రను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ ఫైనాన్షియల్ అడ్వైజర్ శాంతమను, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు అనిత లాలయ్య, ఎంపిపి దాసరి యెల్లుబాయి తదితరులు పాల్గొన్నారు.

బిసిలకిచ్చిన హామీలు అమలు చేయాలి : ఎంపి కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ బిసిలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అసెంబ్లీలో కలిసిన ఆయన సిఎంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బిసి క్రిమిలేయర్ ఎత్తి వేయడం, స్థానిక సంస్థల్లో బిసిలకు ఇప్పుడున్న 18 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడ జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం తదితర అన్ని హామీలను నెరవేర్చాలని కోరారు.

అడ్వాన్స్‌డ్ ప్రోగ్రాంతో పోటీ పరీక్షలకు బోధన : టుటోరాక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలోని హైటెక్స్‌లో జరిగిన రెండు రోజుల విద్యా సదస్సు 4వ ఎడిషన్ ఇటి టెక్ ఎక్స్‌ను అట్టహాసంగా నిర్వహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. శనివారం జరిగిన ఈ సదస్సులో హైదరాబాద్‌కు చెందిన ఎడ్యు టెక్ టుటోరాక్ అకాడమీ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుందని ఆ సంస్థ పేర్కొంది. అడ్వాన్స్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా తమ సంస్థ అకాడమీ కె11, కె12 గ్రేడ్‌లకు ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ఎక్స్పీరియన్స్ అందిస్తోందని టుటోరాక్ అకాడమీ ఫౌండర్ మల్లికార్జున్ పేర్కొన్నారు. సమీకృత పాఠ్యప్రణాళిక ద్వారా ప్రస్తుత బోధనా విధానంలో సమకూరుస్తున్నామన్నారు.

మార్చి కల్లా వంద స్టోర్లకు విస్తరిస్తాం : అప్టానిక్స్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి వంద స్టోర్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని దేశంలోనే అతిపెద్ద ఆపిల్ ప్రీమియం రిసెల్లర్‌గా ఉన్న అప్టానిక్స్ తెలిపింది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 20 నగరాల్లో తమకు 60 స్టోర్లు, 16 సర్వీసు సెంటర్లు ఉన్నాయని పేర్కొంది. వచ్చే మార్చి చివరి నాటికి మరో 40 కొత్త స్టోర్లు తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించింది.

డెంగీతో యువతి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డెంగీ జ్వరంతో యువతి ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో శనివారం జరిగింది. కీతవారిగూడెం గ్రామానికి చెందిన కడప వినీత (29) ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవారు. కొద్దినెలల కిందట తల్లీతండ్రి చనిపోవడంతో సోదరుల ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఆమెకు డెంగీ జ్వరం వచ్చి సరైన చికిత్స అందక పరిస్థితి విషమించి మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.

వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానిస్తాం

- కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపిస్తాం
- బెల్టుషాపులను మూసివేయిస్తాం
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన టి.రామ్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగానే వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ చట్టాన్ని అనుసంధానిస్తామని కాంగ్రెస్ సభ్యులు టి.రామ్మోహన్‌రెడ్డి నొక్కి చెప్పారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ఆయన శనివారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.టిపిసిసి అధ్యక్షులుగా రేవంత్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు నిర్బంధ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడారన్నారు. గతంలో ఏదైనా సమస్యపై ధర్నా చేద్దామంటే ఆ రోజు ఉదయమే ఇండ్ల ముందు వందల మంది పోలీసులు పోగయ్యేవారనీ, ఇండ్ల నుంచి బయటకు రానివ్వలేదని చెప్పారు. తమది ప్రజాస్వామ్యయుత ప్రభుత్వమనీ, అలాంటి వాటికి దూరంగా ఉంటామని అన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోపే మహాలక్ష్మి పథకంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీని నెరవేర్చామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షల కు పెంచిన విషయాన్ని ప్రస్తావించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టించి ఇవ్వడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించా రు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం 42 వేల ఇందిరమ్మ ఇండ్లను పేదలకు పంచితే దానిపై సిఐడి విచారణ చేయించారని విమర్శించారు. కెజి టు పిజి ఉచిత విద్య పథకాన్ని గత ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రతి మండలంలోనూ అంతర్జా తీయ ప్రమాణాలతో మోడల్ స్కూళ్లను కట్టిస్తుందని తెలిపారు. బాసర ట్రిబుల్ ఐటి మాదిరిగానే రాష్ట్రంలో మరో నాలుగు ట్రిబుల్ ఐటిలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం తమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ముచ్చర్లలో ఫార్మాసిటీని రద్దు చేస్తామనీ, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని ప్రజలకి చ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు బెల్ట్ షాప్‌లను మూసివేయిస్తామని చెప్పారు. బిస కుల గణన చేసి ప్రతి జిల్లాకు ఒక బిసి భవన్ కట్టిస్తామన్నారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని తెలిపారు. ఆ తీర్మానాన్ని బలపర్చిన కాంగ్రెస్ సభ్యులు వివేక్ వెంకటస్వామి మాట్లాడు తూ.. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో జరుగుతున్న అన్యాయంపై కొట్లాడి తెలంగాణ సాధించుకు న్నామనీ, అయితే, తొమ్మిదిన్నరేండ్ల కాలంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల లక్షలాది ఎకరాల భూములు నీట మునుగుతున్నాయనీ, మంచిర్యాల పట్టణంలోకి కూడా వాటర్ వస్తుందని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా గ్రావిటీతో నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా రీడిజైన్ చేశారనీ, ప్రాజెక్టును ఆంధ్రా కాంట్రాక్టర్‌కు ఇచ్చారని విమర్శించారు. తెలంగాణ కాంట్రాక్టర్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. చాలానియోజకవర్గాల్లో మిషన్ భగీ రథ ద్వారా నీళ్లే అందలేదన్నారు. 60 వేల కోట్ల రూపాయలు ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఘటనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లారీ, కారు, బొలేరో వాహనం, లారీ ఢీకొన్న ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలు శనివారం కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో జరిగాయి. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో జరిగిన ఘటనకు సంబంధించి ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన బెల్లంకొండ ఆకాష్, అతని స్నేహితులు పైడిపల్లి రాకేష్, మ్యాడగొని శ్రావణ్ హనుమకొండ నుంచి వేములవాడకు కారులో వెళ్తున్నారు. తాడికల్ శివారులో కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణ్, ఆకాష్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాకేష్‌ను ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ఆకాష్ తండ్రి బెల్లంకొండ రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆగిన లారీని ఢీకొన్న బొలేరో వాహనం

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం అడవి మద్దలపల్లి గ్రామ సమీపంలో గంగమ్మ ఆలయం వద్ద ధాన్యం లోడుతో ఆగి ఉన్న లారీని కోళ్ల లోడుతో వెళుతున్న బొలేరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ పక్కన కూర్చున్న కురసం వెంకన్న(40) మృతి చెందారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బయ్యారం మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన గోగుల సాయి, కురసం వెంకన్న బొలేరో ట్రాలీలో కోళు వేసుకొని వరంగల్ నుంచి ఏన్కూరు వెళుతున్నారు.కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలోని మెయిన్ రోడ్డు వద్ద గల గంగమ్మ గుడి సమీపంలో ధాన్యం లోడుతో ఉన్న లారీని డ్రైవర్ రోడ్డుపై ఆపాడు. బొలేరో వాహనం లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో బొలేరోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ పక్కన కూర్చున్న కురసం వెంకన్న అక్కడికక్కడే మృతిచెందారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య కురసం కార్తీక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది.

రియల్ ఎస్టేట్ రంగంలో జవాబుదారీతనం తప్పనిసరి

- రెరా చైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రియల్ఎస్టేట్ రంగంలో కొనుగోలుదారులు తాము కష్టపడి సంపాదించిన సొమ్ములో 71 శాతం పొదుపు చేస్తున్నారనీ, ఈ కారణంగా ఆ రంగంలో పారదర్శకత, జవాబుదారీ తనం తప్పనిసరి అని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలోని ఐఎంసి ఆధ్వర్యంలో రెరా అధికారులకు, నారెడ్కో, క్రెడాయ్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఎంపికైన ప్యానల్ సభ్యులకు 'మధ్యవర్తిత్వం రాజీమార్గం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. సామాజిక, వృత్తి, వ్యాపార పరమైన మానవ సంబంధాలను పునరు ద్ధరించడంలో మధ్యవర్తిత్వంతో కూడిన రాజీమార్గం ఎంతో దోహద పడుతుందని తెలిపారు. వ్యవసాయ రంగం తర్వాత దేశ జాతీయాభివృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం కీలకపాత్ర వహిస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక ఉపాధి కల్పన పరంగా ఆ రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో 'రెరా' అథారిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జనవరిలో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ మహాసభలు

- ప్రధాన కార్యదర్శి ఇంద్రశేఖర్‌మిశ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత ఉపాధ్యాయ సమాఖ్య (ఎఐఎస్‌టిఎఫ్) 27వ జాతీయ మహాసభలు వచ్చే నెల 11, 12 తేదీల్లో కర్నూల్ పట్టణంలో జరుగుతాయని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఇంద్రశేఖర్ మిశ్రా చెప్పారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియు కార్యాలయంలో ఎఐఎస్‌టిఎఫ్ ఆహ్వాన సంఘం సమావేశాన్ని ఎపి, తెలంగాణ అధ్యక్షులు ఎల్ సాయిశ్రీనివాస్, ఎం పర్వత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం, విద్యాహక్కు చట్టంపై చర్చా పత్రం ఉంటుందని చెప్పారు. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌టిఎఫ్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎపి, తెలంగాణ ఎస్‌టియు ప్రధాన కార్యదర్శులు హెచ్ తిమ్మన్న, జి సదానందంగౌడ్, ఎఐఎస్‌టిఎఫ్ కార్యదర్శి అన్సారీ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్, వై కరుణాకర్‌రెడ్డి, పోల్‌రెడ్డి, కమల్ అహ్మద్, పరమేశ్వర్, భాస్కర్, ఇఫ్తకారుద్దీన్, రాధ, జయలక్ష్మి, అజర్ జహన్, పి ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే సిబ్బందికి సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తమ పనితీరుతో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన పలువురు అధికారులు జాతీయ స్థాయి అతివిశిష్ట రైలు సేవ పురస్కారాలను దక్కించుకున్నారు. న్యూఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆయా పురస్కారాలను అందజేశారు. కాజీపేట డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ డీఎస్ రామారావు, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సిఎచ్. దినేష్ రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ మల్లెల శ్రీకాంత్, డివిజనల్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ శివకుమార్ కశ్యప్, మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష, టికెట్ ఇన్‌స్పెక్టర్ టి.నటరాజన్, ట్రాక్ మెయింటెయినర్ వీ.రంగయ్యలు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు ఛైర్మన్ జయ వర్మ సిన్హా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇది ప్రజాస్వామ్యం... రాచరికం కాదు

- నిర్బంధం నుంచి తెలంగాణకు స్వేచ్ఛ వచ్చింది
- అవినీతి, అక్రమాలపై విచారణ జరపాల్సిందే
- మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇది ప్రజాస్వామ్యం... రాచరికం కాదు' అని శాసనమండలిలో స్వతంత్ర సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి వ్యాఖ్యానించారు. మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం ఆయన మాట్లాడుతూ.. నిర్బంధం నుంచి తెలంగాణకు స్వేచ్ఛావాయువులు వచ్చాయంటూ ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. తాను ఆర్‌టిసి బస్సు, మెట్రోలో ప్రయాణిస్తాననీ, ప్రజల మాటలను గమనిస్తానని అన్నారు. తన ప్రసంగంలో దాశరథి పాట, కాళోజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, అబ్రహం లింకన్ మాటలను ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. ఈ పది రోజుల్లో కాంగ్రెస్ పాలనలో ఉన్న స్వేచ్ఛ చివరి రోజుల వరకు కొనసాగాలని ఆకాంక్షించారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళల స్వతంత్రతకు, స్వేచ్ఛగా సంపాదించే హక్కుకు దోహదపడుతుందని చెప్పారు. అయితే ఆర్‌టిసికి ప్రతినెలా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం అభినందనీయమని అన్నారు. ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపర్చాలనీ, పీహెచ్‌సీలు, యుహెచ్‌సీలు,

సీహెచ్‌సీలను పటిష్టం చేయాలని కోరారు. కౌలు రైతులకూ రైతుబంధు వర్తింపచేస్తామనే హామీ ఇవ్వడాన్ని అభినందించారు. ల్యాండ్ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. అసైన్డ్ భూములను కబ్జా చేసిన వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రతిపక్షం, పాలకపక్షం అని కాకుండా అందరం ప్రజలపక్షం ఉండాలని చెప్పారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. అన్ని శాఖలకు సంబంధించిన ఆర్థిక పరిస్థితి, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై విచారణ జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసేందుకు నాలుగుసార్లు ప్రగతి భవన్‌కు వెళ్లినా కలవలేదని చెప్పారు. 160 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా కలిసే సమయం లేదా? అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. అపాయింట్‌మెంట్ కావాలని 30 సార్లు లేఖ రాశాననీ, చివరికి శాసనమండలి చైర్మన్ దృష్టికి కూడా తెచ్చానని గుర్తు చేశారు. అయినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఇది ప్రజాస్వామ్యం, రాచరికం కాదన్నారు. కానీ ఈ పది రోజుల్లోనే సిఎం రేవంత్‌రెడ్డిని నాలుగు సార్లు కలిశానని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను తేవాలని కోరారు. రాష్ట్రంలో మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. ప్రభుత్వ బడుల బాగుకోసం చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీలు, మున్సిపల్ కార్మికులతో పాఠశాలల పరిశుభ్రత పనులకు స్వస్తి పలకాలనీ, స్వచ్ఛ కార్మికులను నియమించాలని కోరారు. విద్యార్థులు ప్రయివేటు బడులకు ఎందుకు వెళ్తున్నారో పరిశీలించాలని చెప్పారు. హైదరాబాద్‌లో 80 శాతం, మేడ్చల్‌లో 82 శాతం, సంగారెడ్డిలో 72 శాతం మంది పిల్లలు ప్రయివేటు బడుల్లో చదువుతున్నారని వివరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన యోధులను స్మరిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని బలపరుస్తున్నానని చెప్పారు.

అసెంబ్లీని అస్థిరపరిచే ప్రసంగాలు సరికాదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇప్పటికీ శాసన సభలో మాకు బలం ఉంది. మీరు 65...మేము 54 అంటూ బిఆర్‌ఎస్ నాయకులు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడ్డం దేనికి సంకేతం' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. ఎనిమిది మంది బిజెపి సభ్యులతో పాటు, ఏడుగురు ఎంఐఎం సభ్యులను కలుపుకుని తామంతా ఒక్కటేనని బిఆర్‌ఎస్ నాయకులు చెప్పదలచుకున్నారా? అని శనివారం ఒక ప్రకటనలో నిలదీశారు. బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఎన్నికల సందర్భంగా అనేక సభల్లో మాట్లాడుతూ తన చివరి శ్వాస వరకు బిఆర్‌ఎస్ లౌకిక పార్టీగానే కొనసాగుతుందని నొక్కి వక్కాణించారని గుర్తు చేశారు. మరి ఇప్పుడు సభలో ఈ ప్రస్తావన ఆ ప్రకటనకు పూర్తిగా విరుద్ధం కదా?అని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా కులాలు, మతాలు, తెగల మధ్య అస్థిత్వ భావజాలాన్ని ఉపయోగించి పబ్బం గడుపుకుంటున్న బిజెపితో బిఆర్‌ఎస్ అంటకాగదలచుకున్నదా? అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభను అస్థిరం చేసే ఇలాంటి ప్రసంగాలను బిఆర్‌ఎస్ నాయకులు చేయడం సరికాదని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు, ఇతర వాగ్దానాలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వాటిని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యలపై చర్చలకు, పరిష్కారాలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సభ నడిచే సమయం మరింత పెరగాలనీ, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా ఉండాలని కోరారు.

షేక్ సాబ్జీ మృతికి తమ్మినేని సంతాపం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ మాజీ అధ్యక్షుడు షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం పట్ల తమ్మినేని వీరభద్రం సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉపాధ్యాయ రంగంలో చురుకైన నాయకుడిగా ఆయన పనిచేశారని పేర్కొన్నారు. ఆయన మరణం ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరనిలోటని తెలిపారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి సీతక్కకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉపాధి హామీ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే కార్మికులకు మంచినీళ్ళు అందించే బాధ్యత పంచాయతీలకు అప్పగించటం అభినందనీయమని తెలిపారు. ఉపాధి హామీకి కేంద్రం తన బడ్జెట్‌లో కోత పెడుతున్నదని తెలిపారు. పని ప్రదేశంలో ఆన్‌లైన్ హాజరు, రెండు సార్లు ఫోటో క్యాప్చర్, ఆధార్ ప్రాతిపదికన కూలి డబ్బులు చెల్లించటమనే చర్యలు అన్యాయమని పేర్కొన్నారు. సకాలంలో కూలి డబ్బులు రావటం లేదనీ, అవి పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. కొత్త జాబు కార్డులు ఇవ్వకపోగా, ఉన్నవాటిని తొలగిస్తున్నారని వివరించారు. భూమిలేని ఉపాధి హామీ, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిందనీ, దాని అమలుకు ముందు కార్డులు లేని వ్యవసాయ కార్మికులందరికీ కొత్త జాబు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి విధానాలు ఉపాధి హామీ చట్ట స్ఫూర్తికి భంగం కలిగిస్తున్నాయని వివరించారు. చట్టం రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి : ఆశా వర్కర్ల యూనియన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి జయలక్ష్మి, ఆర్ నీలాదేవి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయంలో వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు 15 రోజులు ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారని గుర్తు చేశారు. సమ్మె సందర్భంగా మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా, ఆర్థికంగా అనేక సహాయ సహకారాలు అందించారని తెలిపారు. అందుకు మంత్రికి, కాంగ్రెస్ నాయకత్వానికి ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఇచ్చారనీ, వాటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె సునీత, జి.కవిత, గంగమణి, కార్యదర్శి ఎం కొండలక్ష్మి, నాయకులు మీన, టి యాదమ్మ, ఎం అనిత, హేమలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న జూడాలు

జూడాల ఆందోళన తాత్కాలికంగా విరమణ

- సమస్యల పరిష్కారానికి డైరెక్టర్ లిఖితపూర్వక హామీ
- కొనసాగుతున్న కమిటీల విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిమ్స్ మెడికోలు మూడురోజులు చేపట్టిన ఆందోళనను విరమించారు. బుధవారం అర్ధరాత్రి రిమ్స్ కళాశాలలోకి డైరెక్టర్ ఫ్యాన్స్ అంటూ కొందరు చొరబడి దాడి చేయడంతో కలకలం రేపింది. మెడికోలు విధులను బహిష్కరించి రిమ్స్ ఎదుట ఆందోళన చేపట్టి డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలంటూ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టర్ అక్కడికి వచ్చి మెడికోలతో మాట్లాడి విచారణకు కమిటీ ఏర్పాటు చేయడంతో ఆందోళన విరమించారు. శుక్ర, శనివారం సైతం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. డైరెక్టర్ స్పందించి సమస్యల పరిష్కారానికి మెడికోలతో చర్చలు జరిపి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం తమ డిమాండ్లను ఎంత సమయంలో పరిష్కరిస్తారో లిఖితపూర్వకంగా రాసి డైరెక్టర్ మెడికోలకు అందజేశారు.

ఆందోళన విరమిస్తున్నాం : జూడాల అధ్యక్షుడు

జూడాలతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి టైం బాండ్ రాసివ్వడంతో నిరసన విరమిస్తున్నట్టు జూడాల అసోసియేషన్ రిమ్స్ అధ్యక్షుడు అరుణ్ తెలిపారు. మూడురోజుల కిందట రిమ్స్ కళాశాల ఆవరణలోకి కొందరు వ్యక్తులు వచ్చి దాడి చేయడంతో నిరసన కొనసాగిందని చెప్పారు. ఈ దాడిపై మూడు కమిటీలు విచారణ చేపడుతున్నాయన్నారు. తమకు న్యాయం కావాలని అత్యవసర సేవలు కూడా బహిష్కరిస్తామని ప్రకటించడంతో డైరెక్టర్ తమను సంప్రదించి గిరిజన ప్రాంత ప్రజలకు వైద్యసేవలో ఇబ్బందులు కలగొద్దని చెప్పినట్టు వివరించారు. తమ సమస్యలు చెప్పాలని డైరెక్టర్ సూచించడంతో 15 డిమండ్లను రాతపూర్వకంగా ఇచ్చినట్టు చెప్పారు. వాటిని త్వరతగతిన పరిష్కరించేలా హామీ ఇవ్వడంతో తమ నిరసనను తాత్కాలింగా విరమిస్తున్నట్టు తెలిపారు. నిర్ణీత సమయంలోపు తమ సమస్యలను పరిష్కరించకపోతే మళ్లీ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అలాగే విచారణ కమిటీలో తమకు విరుద్ధంగా రిపోర్టు వచ్చినా మళ్లీ ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు.

మెడికోల డిమాండ్ల పరిష్కారానికి కృషి : డైరెక్టర్

మెడికోల డిమాండ్ల పరిష్కారానికి పూర్తి చర్యలు తీసుకుంటామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. రక్షణ కల్పించాలని, సిసి కెమెరాలు, అదనపు ఫ్లోర్ తదితర వాటి గురించి ప్రస్తావించారన్నారు. తన పరిధిలో ఉన్న వాటిని సోమవారం వరకు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఉన్నత స్థాయిలో ఉన్న వాటిని అధికారులు, ప్రభుత్వం, డిఎంఇ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అసత్యాలే

- రేవంత్‌రెడ్డి ఢిల్లీ నామినేటెడ్ సిఎం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేవంత్‌రెడ్డి ప్రజలెన్నుకున్న సిఎం కాదనీ, ఢిల్లీ పెద్దలు నామినేట్ చేసిన ముఖ్యమంత్రి అని బిఆర్‌ఎస్ సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై కెటిఆర్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తప్పుల తడకగా ఉందని విమర్శించారు. అందులో అసత్యాలు, అభూత కల్పనల ఉన్నాయని చెప్పారు. ఇలాంటి ప్రసంగం వినడానికి తాను సిగ్గుపడుతున్నాననీ, ఇంతటి దారుణమైన ప్రసంగం అసెంబ్లీ చరిత్రలో ఎన్నడూ వినలేదని వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగాన్ని బట్టే వచ్చే ఐదేండ్లు కాంగ్రెస్ పాలన ఎలా ఉంటుందో తమకూ, ప్రజలకూ అర్థమైందన్నారు. పాలకపక్షంలో కూర్చున్నా.. విపక్షంలో కూర్చున్నా తామెప్పుడూ ప్రజల పక్షమే అని చెప్పారు. తెలంగాణ ప్రజల తరఫున గొంతు విప్పుతామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదవుల కోసం పెదాలు మూసుకున్నది అప్పటి కాంగ్రెస్ మంత్రులు కాదా? అని నిలదీశారు. కొత్త ప్రభుత్వానికి మూడు నెలల సమయం ఇద్దామని తమ నేత కేసీఆర్ సూచించారన్నారు. ఆ తర్వాత ఆ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అవుతుందని కూడా చెప్పారన్నారు. తమవైపు ప్రతిపక్షాలతో కలుపుకుని 54 మంది సభ్యులున్నారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి కల్పించుకుని మాట్లాడుతూ.. అచ్చోసిన ఆంబోతులా వ్యవహరించవద్దని

సూచించారు. దీనిపై కెటిఆర్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి నోట ఆ మాటలు రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్‌ఆర్‌ఐలు నాన్ రిలయబుల్ ఇండియన్స్ అని సిఎం అనడం సరికాదన్నారు. ఎన్‌ఆర్‌ఐల పట్ల సిఎంకు ఉన్న ప్రేమను ఎన్‌ఆర్‌ఐలు గమనించాలని కోరారు. 'కాంగ్రెస్ హయాంలో సాగు, తాగునీటికి దిక్కు లేదు. కరెంట్ అనేది అడ్రస్సే లేదు. నల్లగొండలో ఫ్లోరోసిస్‌తో లక్షన్నర మంది నడుములు వంగిపోతుంటే ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా మాట్లాడలేదు. దేవరకొండలో పసిపిల్లల అమ్మకాలు, పాతబస్తీలో మైనార్టీ తీరని బాలికల వివాహాలు, మహబూబ్‌నగర్‌లో గంజి కేంద్రాలు, పాలమూరు నుంచే ప్రతి సంవత్సరం 14 లక్షల మంది వలసలు పోయే వారని' కెటిఆర్ గుర్తు చేశారు. పదేండ్ల గురించే చర్చించాలంటున్నారు.. మరి 50 ఏండ్ల కాంగ్రెస్ పాలన గురించి తాము మాట్లాడొద్దా? అని ప్రశ్నించారు. 2009 నుంచి 2013 మధ్యలో 8198 మంది రైతులు కరెంట్ షాకులతో చనిపోయారని తెలిపారు. తొమ్మిదిన్నరేండ్లలో పాలమూరు నుంచి వలసలు ఆగిపోయాయనీ, 14 రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారని వివరించారు. నల్లగొండ జిల్లా ప్రజలకు ఫ్లోరోసిస్ నుంచి విముక్తి కల్పించింది కేసీఆరే అన్నారు. కేంద్రం కూడా తెలంగాణను ఫ్లోరోసిస్ రహిత రాష్ట్రంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నేతన్నల ఆత్మహత్యలతో ఉరిసిల్లగా పేరొందిన సిరిసిల్ల తమ ప్రభుత్వ హయాంలో సిరిశాలగా మారిందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జాతీయ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం గెలుచుకున్నామన్నారు. బస్సులు ఫ్రీ, బంగారం ఫ్రీ, బండి ఫ్రీ అని కాంగ్రెసోళ్లు గెలిచారనీ, వాటిని నిలబెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రకటించిన మెగాడీఎస్సీ, జాబ్‌క్యాలెండర్‌పై అతీగతీ లేదని విమర్శించారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ నుంచి తెచ్చిఇస్తారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వివేక్ 40 వేల ఉద్యోగాలు ఇస్తానన్న హామీని ఎలా నెరవేరుస్తాడని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారనీ, వాటిని నెరవేర్చి మాకంటే మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఫార్మారంగంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో ఎదుగుతున్న తరుణంలో ఫార్మాసిటీని కొనసాగించాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే ఉద్యమ లక్ష్యాలు నెరవేరుతాయి

- ఐదేళ్లలో ఆరు లక్షల ఉద్యోగాల భర్తీ
- మండలిలో కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఉద్యమ లక్ష్యాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆ పార్టీ సభ్యులు టి జీవన్‌రెడ్డి చెప్పారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆయన శనివారం ప్రవేశపెట్టారు. స్వతంత్ర సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి బలపరిచారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ...బిఆర్‌ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించాలని చెప్పారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సాంకేతిక, నిర్మాణ లోపానికి కారకులైన దోషులను శిక్షించాలని కోరారు. రూ.నాలుగు వేల కోట్లతో తాగునీరు అందించాల్సి ఉండగా, రూ.40 వేల కోట్లతో మిషన్ భగీరథ చేపట్టారని అన్నారు. కమీషన్ల కోసమే ఆ పథకాన్ని అమలు చేశారని ఆరోపించారు. ఐటీఐఆర్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేస్తే బిఆర్‌ఎస్ ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. బిశ్వాల్ కమిటీ సిఫారసుల ప్రకారం రాష్ట్రంలో 1.91 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటి భర్తీకి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. టిఎస్‌పిఎస్‌సి పనితీరు,

ప్రశ్నాపత్రాల లీకేజీ, గ్రూప్-1 రద్దు కావడం వంటి పరిణామాలతో ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిందని అన్నారు. చైర్మన్, సభ్యులను తొలగించి నియామకాలు చేపడితే బాగుండేదని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో బలిదానాలు జరిగితే, ఉద్యోగాల కోసం ప్రత్యేక రాష్ట్రంలోనూ అవి కొనసాగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరు వేల సర్కారు బడులు మూతపడ్డాయనీ, వాటిని తెరిపించాలని కోరారు. పర్యవేక్షణకు ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డీఇఒలు లేరనీ, అంతా ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారని వివరించారు. 20 వేల ఉపాధ్యాయ ఖాళీలుంటే ఐదు వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఓ జోన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుత జోనల్ విధానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగు జోన్ల పరిధిలో ఉందన్నారు. 317 జిఒను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమీక్షించాలని కోరారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు కాకుండా నాలుగు నుంచి పదో తరగతి వరకు ప్రాతిపదికన స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. గురుకులాలకు శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ప్రయోజనం కలిగిస్తున్నా, ఆటో కార్మికులను ఆదుకోవాలనీ, ఏటా రూ.12 వేలు చెల్లించాలని కోరారు. మద్యం నియంత్రణ శాఖకు బదులుగా మద్యం ప్రోత్సాహక శాఖగా మారిపోయిందన్నారు. ఆబ్కారీ శాఖకు గతంలో రూ.ఎనిమిది వేలున్న ఆదాయం ఇప్పుడు రూ.40 వేల కోట్లకు చేరిందని వివరించారు. బెల్టుషాపులను అరికట్టాలని కోరారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పున:ప్రారంభించాలని సూచించారు. రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని చెప్పారు. రూ.లక్షలోపు రుణాలు మాఫీ కానివారుంటే అవి పూర్తి చేయాలని అన్నారు. ధరణిలో లోపాలను సరిదిద్దాలని కోరారు. తొలి ఏడాది రెండు లక్షలు, ఆ తర్వాత నాలుగేండ్లలో ఏడాదికి లక్ష చొప్పున నాలుగు లక్షల ఉద్యోగాలు కలిపి ఐదేండ్లలో ఆరు లక్షల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలివ్వాలనీ, పెండింగ్ బిల్లులను చెల్లించాలనీ, పెండింగ్‌లో ఉన్న డిఎలను మంజూరు చేయాలని చెప్పారు. బిసిలకు 40 శాతం రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. కులగణన చేపట్టాలని అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అందుకే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ఆమోదిస్తున్నానని చెప్పారు.

హామీలు అమలు చేయకపోతే ఊరుకోం

- కేంద్రం సహకరించకుంటే చేయరా? : ఎ.మహేశ్వర్‌రెడ్డి
- బిజెపికి సిగ్గుండాలే : మంత్రి పొన్నం ప్రభాకర్
- పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా కోసం ఏకగ్రీవ తీర్మానం చేద్దాం : కడియం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల చుట్టే తిప్పుతున్నదనీ, మిగతా 412 హామీల సంగతేంటి? అని బిజెపి సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. హామీలను నెరవేర్చేందుకు నిధులు ఏవిధంగా సమకూర్చుకుంటారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో చెప్పిన 418 హామీలకు చట్టబద్ధత ఎప్పుడు కల్పిస్తారని అడిగారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజాసమస్యలను పరిష్కరించే వేదికగా ఉండాలిగానీ పబ్లిసిటీ వేదికగా మార్చొద్దని సూచించారు. రోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పి.. ఇప్పుడు వారానికి రెండు రోజులే అని చెప్పడం ఎంతవరకు సబబని అడిగారు. "ప్రగతిభవన్‌ను ఆస్పత్రిగా మారుస్తాం. ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లను తయారు చేసే విధంగా స్టడీసర్కిల్ మారుస్తాం" అన్న హామీని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన బెట్టారని ప్రశ్నించారు. చివరకు దాన్ని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నివాసంగా మార్చారని విమర్శించారు. మెడికల్ కాలేజీలకు కేంద్రం నిధులిచ్చిందని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తే స్వాగతిస్తామన్నారు. ఆ అప్పులను సాకుగా చూపెట్టి ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోవాలని చూస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా దక్కించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు.

తెలంగాణను అవమానించింది బిజెపోళ్లే : పొన్నం

మహేశ్వర్‌రెడ్డి ప్రసంగం మధ్యలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకున్నారు. 'బిజెపివాళ్లకు సిగ్గుండాలే. తెలంగాణను వాళ్లు ఎప్పుడూ అవమానిస్తూనే ఉన్నారు. "తల్లిని చంపి బిడ్డను వేరుచేశారు" అని పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోడీ తెలంగాణను అవమానించింది వాస్తవం కాదా? మిమ్ముల్ని కలుపుకుని 54 మందిమి ఉన్నామని కెటిఆర్ అంటున్నారు. ఇవేం బెదిరింపులు?' అంటూ సీరియస్ అయ్యారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల అందజేత, 200 యూనిట్లలోపు వాడుకునే వారికి ఉచిత కరెంటు, తదితర హామీల అమలు కోసం అన్ని పార్టీల సహాయ సహకారాలు తీసుకుని ముందుకెళ్తామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సహకారం అందించాల్సిన బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనా ఉందన్నారు. మహేశ్వర్‌రెడ్డి ప్రసంగంలో జోక్యం చేసుకున్న బిఆర్‌ఎస్ సభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలనే డిమాండ్‌తో సభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపుదామని ప్రతిపాదించారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని, ప్రశ్ననే ప్రగతికి మూలమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు అన్నారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు, కన్వీనర్ రాజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో నవంబర్ 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు సైన్స్ ఎగ్జిబిషన్‌లను జాతీయ శాస్త్రీయ దృక్పథంతో నిర్వహిస్తున్నారన్నారు. నవంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్లు రిలీజ్ చేసి 60 సదస్సులు నిర్వహించారని తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగాలు నేర్పిస్తారన్నారు. ప్రజలలో శాస్త్రీయ బలాన్ని పెంపొందించడం ప్రశ్నించే తతత్వాన్ని అలవాటు చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రతి విషయాన్నీ బట్టీ పట్టడం కాకుండా పూర్తిగా అన్వేషించి అర్థం చేసుకోవాలని చెప్పారు. సైన్స్‌ను మార్కుల కోసం కాకుండా ప్రయోగాలతో నేర్చుకోగలిగితే సులభంగా అర్థమవుతుందన్నారు. నిత్యం జీవిత ఘటనలలోంచి సైన్స్ సూత్రాలను తెలుసుకోవడం విద్యార్థులు లక్ష్యంగా మార్చుకోవాలని సూచించారు. అందుకోసం జనవిజ్ఞాన వేదిక శిక్షణ అందిస్తుందని తెలిపారు.